

## సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. 8లో▸



## దళితుల జీవితాలతో చెలగాటం

రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయని వక్తలు విమర్శించారు. 8లో▸



## పాపం పసికందు

రెండు రోజుల క్రితం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి రోడ్డు పక్కన వదిలేసి వెళ్లింది. ఈ సంఘటన విర్యాల శివారులో జరిగింది. 8లో▸

### న్యూస్‌రీల్

## డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన



ప్రభుత్వ డిగ్రీకళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం పనులు త్వరగా పూర్తి చేసి ఈ ఏడాది విద్యార్థులకు అందుబాటులోకి వచ్చేలా చూడాలని అధికారులను ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆదేశించారు. మండలకేంద్రంలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పనులు మాత్రం ఆగకుండా పూర్తిచేయాలన్నారు. పక్కనే ఉన్న మినీ స్టేడియం పనులను సైతం పరిశీలించారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు, అధికారులు ఉన్నారు.

## మైనింగ్ జోన్ బాధితులకు పరిహారం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బండరావిరాల, చిన్నరావిరాల బాధితులు

ఇబ్రహీంపట్నం రూరల్: బండరావిరాల, చిన్నరావిరాలలో మైనింగ్‌జోన్‌కు భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు గొరెంకల నర్సింహ, అబ్దుల్లాపూర్‌మెంట్ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ డిమాండ్ చేశారు. బండరావిరాల, చిన్నరావిరాల బాధితులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓ హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం బాధితులకు పరిహారం ఇస్తామని మాట తప్పిందని విమర్శించారు. 275 రోజులుగా దీక్ష చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం నుంచి మైనింగ్ జోన్ ఎత్తివేసే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు కృష్ణ, ఐలయ్య, బాలలింగం, మల్లేశ్, బసవమ్, మనెమ్మ, ఇందిరమ్మ, అనసూయ, అండాలు, ఆగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత



అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాట సింగారం సర్వేనంబర్ 10లోని ప్రభుత్వ భూమిలో కొంతమంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదు మేరకు తహసీల్దార్ అనితారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సహకారంతో మంగళవారం రంగంలోకి దిగారు. జేసీబీలతో నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మట్లాడుతూ.. భూమికి సంబంధం లేని పత్రాలను చూపిస్తూ 58, 59జీఓలతో క్రమబద్ధీకరించుకునేందుకు యత్నించడంతో పాటు రెవెన్యూ సిబ్బందిని తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్టు చెప్పారు. ప్రభుత్వ భూమిని ఎవరు కబ్జా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పేదలు కట్టుకున్న నిర్మాణాలను అక్రమంగా రెవెన్యూ అధికారులు కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బాధితులకు అండగా ఉంటామన్నారు.



# శ్రీరస్తు.. శుభమస్తు.. ఆదాయ'మస్తు'

### ఆర్టీసీకి కల్యాణ కాంతులు

- శుభముహూర్తాలతో బస్సుల్లో పెరిగిన ప్రయాణాలు
- కిటకిటలాడుతున్న ప్రయాణ ప్రాంగణాలు
- రోజుకు రూ.లక్షల్లో డిపోలకు ఆదాయం
- లాభాల్లో షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ డిపోలు



షాద్‌నగర్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

షాద్‌నగర్: శ్రీరస్తు.. శుభమస్తు.. కల్యాణమస్తు.. అంటూ పెద్దలు వధూవరులను దీవిస్తుండగా.. ప్రయాణికులు ఆదాయ'మస్తు' అంటూ ఆర్టీసీని ఆదరిస్తున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలతో బంధుగణం ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూర్చిపెడుతోంది. శుభ ముహూర్తాల నేపథ్యంలో ప్రయాణ ప్రాంగణాలు రద్దీగా మారుతున్నాయి. దీంతో జిల్లాలో ఉన్న పలు డిపోలు లాభాలబాట పట్టాయి.

**అలా మొదలైంది**

తాజా పరిస్థితుల్లో ఆర్టీసీ ఆదాయం కోసం కొట్టుమిట్టాడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంస్థ రాబడి మార్గం అన్వేషించింది. ఇప్పటికే ప్రయాణికులతో ఏవిధంగా మర్యాదగా మెలిగి ఆదాయం పెంచుకోవాలన్న దానిపై కండక్టర్లకు శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా పెళ్లిళ్లకు బస్సులను అద్దెకివ్వడం, ప్రయాణికులు చెయ్యి ఎత్తిన చోట బస్సు ఆపడం, సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవడం, ప్రయాణ పరమైన రాయితీలు అందివ్వడం చేస్తోంది. ఇవన్నీ క్రమంగా ఆర్టీసీని రాబడి వైపు నడిపిస్తుండగా దీనికి తాజా వివాహాల సీజన్ కలిసొచ్చింది. జిల్లాలో ఉన్న పలు డిపోలు గత నెల నుంచి ఇప్పటివరకు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో సంస్థకు ఆదాయం పెరుగుతోంది.

**రోజుకు లక్షల్లో రాబడి**

షాద్‌నగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోలు ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తున్నాయి. వివాహ ముహూర్తాల కారణంగా ఈనెల మొదటి వారం నుంచి డిపోలకు రోజువారీ సగటు ఆదాయం గణనీయంగా పెరిగింది. షాద్‌నగర్ డిపోకు రోజుకు సుమారు రూ.15 లక్షలు, ఇబ్రహీంపట్నం డిపోకు రూ.14లక్షలు, మహేశ్వరం డిపోకు రూ.10లక్షలు, రాజేంద్రనగర్ డిపోకు రూ.18లక్షల ఆదాయం వస్తోంది. ముహూర్తాల కారణంగా రాష్ట్రంలోని 45 డిపోలు లాభాల బాట పట్టగా అందులో మన జిల్లా నుంచి నాలుగు డిపోలు ఉండడం విశేషం.

**ఓఆర్ నమోదు ఇలా..**

ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఎంత శాతం నమోదు అవుతుందనేది ఎంతో ముఖ్యం. శుభముహూర్తాల కారణంగా షాద్‌నగర్ డిపోలో 83 శాతం, ఇబ్రహీంపట్నం 60 శాతం, మహేశ్వరం 53 శాతం, రాజేంద్రనగర్ 78శాతం ఓఆర్ నమోదు అవుతుంది. గత మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ వరకు తక్కువగా ఉన్న ఓఆర్ మే మొదటి వారం నుంచి గణనీయంగా పెరిగింది. పెళ్లి ముహూర్తాలు జూన్ రెండో వారం వరకు ఉండడంతో ఓఆర్ పెరగడంతో పాటు సంస్థకు మరింతగా ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

**ఆదాయం వచ్చే మార్గాల్లోనే..**

అవకాశం ఉన్నప్పుడే ఆదాయం సాధించాలనే చందంగా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లిళ్ల సీజన్ కావడంతో అనవసరమైన, రద్దీలేని, లాభాలు రాని రూట్లలో బస్సులను నడిపించడం లేదు. ప్రయాణికులు అధికంగా ప్రయాణించే మార్గాలను గుర్తించి ఆ రూట్లలోనే బస్సులను నడిపిస్తున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులను నడిపిస్తూ సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టారు.

### ఆదాయం పెరిగింది



పెళ్లిళ్ల సీజన్ కావడంతో చాలామంది బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో డిపోలకు రోజువారీ సగటు ఆదాయం పెరిగింది. షాద్‌నగర్ డిపోకు రోజుకు సుమారు రూ.14 లక్షల ఆదాయం వస్తోంది. ఆక్యుపెన్సీ రేషియో తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఉష, డీఎం, షాద్‌నగర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- కలెక్టర్ హరీశ్

ఇబ్రహీంపట్నం రూరల్: నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని కలెక్టర్ హరీశ్ హెచ్చరించారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాలను ఉక్కుపాదంతో అణచివేయాలని వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి, డీజీపీ అంజనీకుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాలో నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా చూడాలని సూచించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు నిత్యం తనిఖీలు నిర్వహించాలన్నారు. కల్తీ లేకుండా నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెల్లారిన బతుకులు

- ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న సిమెంట్ లారీ
- నలుగురి దుర్మరణం, మరో నలుగురికి గాయాలు
- తుర్కయంజాల్ వద్ద ఘటన



ఐనాల మహేశ్



వంపలోళ్ల మహేశ్



నాగ సాయిరెడ్డి



లక్ష్మయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: పొద్దంతా పనిచేసి ఇంటికి వెళ్లి హాయిగా నిద్రపోదామని అనుకున్నారు.. కానీ అంతలోనే శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. ఆగి ఉన్న డీసీఎంను సిమెంట్ లారీ ఢీకొన్న ప్రమాద ఘటనలో నలుగురు మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. హైదరాబాద్‌లోని జియాగూడకు చెందిన ఐనాల మహేశ్ అలియాస్ బల్లు(21), వంపనోళ్ల మహేశ్ (55)తో పాటు మరికొంత మంది డీజే సౌండ్స్‌లో పని చేసేవారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం రాత్రి జరిగిన వేడుకలో పనులు ముగించుకొని అర్ధరాత్రి డీసీఎంలో ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. తుర్కయంజాల్ సమీపంలో తులిప్స్ గ్రాండ్ హోటల్ వద్ద ఆగిన డీసీఎంలోకి ఎల్బీనగర్ వెళ్లేందుకు నాగ సాయిరెడ్డి, శివారెడ్డి, లింగారెడ్డి ఎక్కుతుండగా మాచర్ల నుంచి ఇంజాపూర్ గోదాంకు సిమెంట్ లోడ్‌తో అతివేగంగా వస్తున్న లారీ (టీఎస్15యుఏ 2851) డీసీఎంను బలంగా ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న డీజే ఆపరేటర్ బల్లు, వంపలోళ్ల మహేశ్, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పాతమల్లయ్యపాలెంకు చెందిన నాగ సాయిరెడ్డి(22) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మంగళవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తోటపల్లికి చెందిన తుమ్మోజు లక్ష్మయ్య(52) మరణించాడు. అలాగే.. గుంటూరు జిల్లాకు చెందిన శివారెడ్డి, లింగారెడ్డి ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారు. జియాగూడకు చెందిన అభిలాష్ చెవి తెగిపోగా.. సురేష్ కాలు విరిగింది. కాగా, డ్రైవర్ రవీందర్ మద్యం మత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని, అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రవికుమార్ చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

## డీసీసీ అధ్యక్షుడిగా చల్లా



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చల్లా నర్సింహారెడ్డిని నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం రాత్రి ప్రకటన జారీ చేశారు. ప్రస్తుతం చల్లా తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

## 'లక్ష్మీదేవిపల్లి'పై అనవసర రాద్ధాంతం

- పురోగతిలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు
- భట్టి.. వట్టి మాటలు కట్టిపెట్టు
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఫైర్

షాద్‌నగర్: 'పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పురోగతిలో ఉంది.. దీనిపై ప్రతి పక్షాలు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నాయి.. ప్రాజెక్టుపై ఏమాత్రం అవగాహన లేని భట్టి విక్రమార్కవి అన్నీ వట్టి మాటలే' అంటూ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మండిపడ్డారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాగు, సాగు నీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రాజెక్టు పనులు ప్రస్తుతం జడ్చర్ల పరిధిలోని ఉద్దండాపూర్ వద్ద కొనసాగుతున్నాయని, అక్కడ పూర్తి కాగానే రెండోదశలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయమై సీఎల్పీ నేత భట్టి విక్కమార్క ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఈ ప్రాజెక్టు నిర్మించొద్దని నల్లజెండాలు పట్టుకొని ఆందోళనలు చేపట్టడమే కాకుండా సర్వే పనులను అడ్డుకోవడంతోపాటు గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. నాడు ప్రాజెక్టు పనులను అడ్డుకొని నేడు ప్రాజెక్టు నిర్మించాలని స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పోతిరెడ్డి ద్వారా కృష్ణా జలాలను రాయలసీమ ప్రాంతానికి తరలించుకుపోతే ఆ పార్టీ నేతలు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా,ప్రతిపక్షంలో మరో విధంగా వ్యవహరించడం తగదని ఎమ్మెల్యే హితవు పలికారు. ప్రాజెక్టు పురోగతి పనులు చూసేందుకు వస్తామంటే తీసుకెళ్లేందుకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. ప్రజలను అయోమయానికి గురిచేసేలా తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. సమావేశంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, వంకాయల నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, స్వరూప, నక్కల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వలాభం కోసమే పాలమూరు డిజైన్ మార్పు

మాజీ మంత్రి చిన్నారెడ్డి

కొందుర్గు: ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండలోని తన స్నేహితుల స్వలాభం కోసమే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు డిజైన్ మార్చారని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 38 వేల కోట్లతో పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సంబంధించి 4 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం కోసం జూరాల నుంచి నీటిని తరలించేలా డిజైన్ చేయడం జరిగిందన్నారు. రీడిజైన్ పేరుతో సీఎం కేసీఆర్ పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు తీరని అన్యాయం చేశాడని విమర్శించారు. 2015లో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి భూమిపూజ చేశారని ఇప్పటివరకు కేవలం నార్లాపూర్, ఏదుల, కర్వేన, వట్టెం, ఉద్దండాపూర్ వరకు మాత్రమే కాల్వలు తవ్వారన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఊసేలేదన్నారు. సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, మల్లేష్ గౌడ్, కృష్ణా రెడ్డి, వజ్రమ్మ పాల్గొన్నారు.

**కర్ణాటక ఫలితాలు పునరావృతం**

భట్టి పాదయాత్రలో పాల్గొనడానికి వచ్చిన ములుగు ఎమ్మెల్యే సీతక్క విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌పై నమ్మకంతో కర్ణాటకలో ప్రజలు గెలిపించారని, ఈ ఫలితాలు తెలంగాణలో పునరావృతం కావడం ఖాయమన్నారు. ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా కేసీఆర్ పాలన ఉందని, ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. సమావేశంలో నాయకులు నరేందర్, రామస్వామి, రజిత తదితరులు ఉన్నారు.

## యువత ఉన్నతికి క్రీడలు దోహదం

- మంత్రి సబితారెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

కందుకూరు: యువత పక్కదారి పట్టకుండా క్రీడలు దోహదపడతాయని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌లో మంగళవారం సీఎం కప్–23 క్రీడా పోటీలను జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆణిముత్యాల్లాంటి క్రీడాకారుల్ని గుర్తించి వెలికితీయాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ సీఎం కప్‌నకు రూపకల్పన చేశారని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కప్‌ను కేసీఆర్ ఓ విజన్‌తో చేపట్టారని, అందరూ క్రీడాస్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిరదేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

**మహేశ్వరంలో..**

మహేశ్వరం గడికోటలో సీఎం కప్–23 పోటీలను మంత్రి సబితారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి జ్యోతి వెలిగించి ప్రాంభించారు. అనంతరం క్రీడాకారులకు డ్రెస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన**

మీర్‌పేట: జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సబితారెడ్డి ఆదేశించారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి సిర్లాహిల్స్ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణం పనులను మంగళవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. మంత్రి వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

**రహదారి నిర్మాణ పనుల పరిశీలన**

మహేశ్వరం మండల పరిధిలోని శ్రీశైలం రహదారి నుంచి తుమ్మలూరు మీదుగా మహేశ్వరం వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మంత్రి సబితారెడ్డి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులు, ప్రజాప్రతినిధులను అడిగితెలుసుకున్నారు. త్వరగా పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, తుమ్మలూరు సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి, ఉప సర్పంచ్ కటికల శ్రీహరిముదిరాజ్, మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## డెంగీని సమూలంగా నివారించాలి



అవగాహన ర్యాలీని జెండాఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

- డీఎంహెచ్‌ఓ డా.వెంకటేశ్వర్‌రావు

హుడాకాంప్లెక్స్: డెంగీ వ్యాధిని సమూలంగా నివారించాలని జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్‌రావు అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి డెంగీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. మలేరియా రాష్ట్రస్థాయి అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ దోమల నివారణ, దోమకాటుతో వ్యాప్తిచెందే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. డెంగీని పరిసర పట్టణ ప్రాంతాల్లో ఏ విధంగా నివారించాలో వివరించారు. మున్సిపల్ సిబ్బందితో సంయుక్తంగా పనిచేసి దోమల నివారణకు కృషి చేయాలని, ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప వైద్యాధికారి గీత, స్థానిక వైద్యాధికారి అర్చన, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు రఘు, జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

**షాద్‌నగర్:** క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, సకాలంలో వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సిబ్బందికి సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నియోజకవర్గంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎం, డీఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించడంలో సిబ్బంది వెనకబడి ఉన్నారని అన్నారు. ప్రతి పీహెచ్‌సీలో టీబీ పరీక్షల నిమిత్తం శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే ఏఎన్‌ఎంలు గ్రామాల్లో పర్యటించి గర్భిణుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అందజేస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించాలన్నారు. ఏడాదిలోపు పిల్లలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డీఈఓ ఝాన్సీ, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, డీఈఓలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట

- ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- కడ్తాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కడ్తాల్:** రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చేయూతతో సాగు విస్తీర్ణం భారీగా పెరిగిందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ దశరథ్ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శమన్నారు. సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం, సర్పంచులు లక్ష్మీనర్సింహారెడ్డి, సులోచన, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, మంజుల, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు జహంగీర్ అలీ, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# కారు దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

**షాద్‌నగర్:** మున్సిపల్ పరిధిలోని రాంనగర్ కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో కారు కాలిపోయింది. కొందుర్గుకు చెందిన నగేష్‌కు కారు ఉంది. దీన్ని ఆయన అద్దెకు నడుపుతున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి ముందు నిలిపిన కారును స్టార్ట్ చేసేందుకు యత్నించగా ఒక్కసారిగా పొగలతో మంటలు వ్యాపించారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

# పాపం పసికందు

- రోడ్డు పక్క శిశువును వదిలి వెళ్లిన తల్లి
- శిశువిహార్‌కు తరలింపు


ఐసీడీఎస్ అధికారుల చెంత శిశువు

**షాద్‌నగర్:** రెండు రోజుల క్రితం పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి రోడ్డు పక్కన వదిలేసి వెళ్లింది.. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. అయితే వేడి గాలులకు తట్టుకోలేని ఆ శిశువు రోధించడం మొదలు పట్టింది. దీంతో అటుగా వెళుతున్న మహిళలు శిశువు అక్కున చేర్చుకొని పాలు తాపారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శిశువులను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించడంతో వారు శిశువిహార్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# శుభకార్యానికి వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల

**రాజేంద్రనగర్:** బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యానికి వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల అయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...బిస్మిల్లా హోటల్ ప్రాంతానికి చెందిన షహనాజ్ బేగం తన కుటుంబ సభ్యులతో సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి శుభాకార్యానికి వెళ్లింది. తిరిగి అర్ధరాత్రి ఇంటికి చేరుకుంది. ఇంటి తాళాలు పగల కొట్టి ఉండటం, బీరువాలో దాచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 14 వేల నగదు, టీవీ, ఇతర గృహోపకరణాలు కనిపించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# గొర్రెల కాపరుల సెల్ జిల్లా కన్వీనర్‌గా శ్రీను


శ్రీనుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న లక్ష్మీనారాయణ

**కందుకూరు:** బీజేపీ జిల్లా గొర్రెల కాపరుల సెల్ కన్వీనర్‌గా మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన సీ శ్రీను నియమితులయ్యారు. మంగళవారం పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎం లక్ష్మీనారాయణ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, తనకు పదవి రావడానికి కారణమైన పార్టీ జిల్లా అధ్యక్షుడు బీ నర్సింహారెడ్డి, కార్యదర్శి టీ లక్ష్మణ్ ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గొర్రెల కాపరుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, జిల్లా కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, నాయకులు శంకరి వెంకటేష్, లక్ష్మణ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వ్యక్తి అదృశ్యం


శ్రీనివాస్ (ఫైల్)

**తలకొండపల్లి:** ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ వెంకటేశ్ యాదవ్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు(32) ఈ నెల 9న ఇంట్లో చెప్ప పెట్టకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో శ్రీనివాస్ భార్య అరుణ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# నేడు మెగా గుండె వైద్య శిబిరం

**ఆమనగల్లు:** పట్టణంలోని స్వాతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం మెగా గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్య నిపుణులు డాక్టర్ మధులాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# గుండెపోటుతో చర్చి పాస్టర్ మృతి

**షాద్‌నగర్:** పట్టణంలోని జార్జి మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ ఐజాక్ న్యూటన్(65) మంగళవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. పాస్టర్ మృతితో పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆస్పత్రికి వెళ్లి ఐజాక్ న్యూటన్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# ఆర్టీసీ బస్సు ఢీ కొని యువకుడి మృతి

**రాజేంద్రనగర్:** ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ ఫయాజ్(35) అనే యువకుడు అత్తాపూర్‌లో తన సోదరి వద్ద ఉంటున్నాడు. ఇటీవల అతని సోదరుడు మృతి చెందటంతో మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. కాగా ఆరాంఘర్ చౌరస్తా వద్ద అతన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొనటంతో మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# దళితుల జీవితాలతో చెలగాటం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి సభ్యులు

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

**ఆమనగల్లు:** ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దళిత కులాల నుంచి మతం మారిన వారమని చెప్పుకున్నంత మాత్రన క్రైస్తవులకు రిజర్వేషన్లు ఇవ్వాలా..? అనే పుస్తకాన్ని మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జస్టిస్ రంగనాథ మిశ్రా కమిషన్ నివేదిక అనంతరం జరిగిన పరిణామాలపై పుస్తకంలో పొందు పరిచినట్లు వారు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా.. రిజర్వేషన్లు అనుభవిస్తున్నా మెజారిటీ దళితులు సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాల్లో ఎందుకు మార్పు రావడం లేదని ప్రశ్నించారు. దళిత రిజర్వేషన్ల గురించి భారత రాజ్యాంగం ఏమి చెబుతోంది.. ఆ రిజర్వేషన్లు ఎవరికి చెందాలి.. అనే విషయంలో స్పష్టమైన ఆర్టికల్స్ ఉన్నా రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ ఎవరికి పడితే వారికి రిజర్వేషన్లు ఇస్తూ దళితుల జీవితాలతో చెలగాటమడుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని మేధావులు, రాజకీయ నాయకులు, సంఘ సంస్కర్తలు అధ్యాయనం చేసి, దళితుల స్థితిగతులను మార్చడానికి ఏదీ ఉత్తమమైన మార్గం అనే విషయం మీద చర్చ జరగాలని, తద్వారా దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ, జిల్లా అధ్యక్షుడు జీ భాస్కర్, కార్యదర్శి కే వినోద్, కౌన్సిలర్ జీ నర్సింహ, నాయకులు లక్ష్మణ్, నిరంజన్, శ్రీశైలం, మల్లేశ్ పాల్గొన్నారు.

# పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

**మణికొండ:** తనకు పెళ్లి కావటం లేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టోలిచౌకిలోని హరిజన బస్తీలో ఉంటున్న డి. బాలాజీ, డి. భార్గవ్(23)లు అన్నదమ్ములు. వీరు పుప్పాలగూడ, సెక్రటేరియట్ కాలనీలోని ఉమేష్‌సింగ్ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి 9గంటలకు భోజనం చేసిన భార్గవ్ టెంట్‌హౌస్ గోడౌన్‌కు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడ పని చేసే రాజేశ్ మంగళవారం ఉదయం టెంట్ హౌస్‌కు వచ్చి గోడవున్ షటర్ ఎత్తేందుకు ప్రయత్నిస్తే రాలేదు. విషయాన్ని టెంట్‌హౌస్ యజమానికి తెలిపగా అతను వచ్చి ఇద్దరు కలిసి షటర్‌ను బలవంతంగా తెరిచారు. భార్గవ్ రాడ్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుని సోదరుడు బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

# బస్తీ దవాఖానాలతో ఇంటి వద్దకే వైద్యం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న తలసాని

**అబిడ్స్:** ఆరోగ్య తెలంగాణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యకర జీవితం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మంగళవారం గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని అబిడ్స్ నేతాజీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బస్తీ దవాఖానాలతో ప్రజలకు ఇంటివద్దకే వైద్యం అందిస్తున్నామన్నారు. అన్ని బస్తీలు, మురికివాడల్లో వారికి అనుకూలంగా ఉండే విధంగా బస్తీ దవాఖానా ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన వైద్య అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకట్, కార్పొరేటర్లు డాక్టర్ సురేఖ ఓంప్రకాష్, బీఆర్‌ఎస్ నేతలు గడ్డం శ్రీనివాస్ యాదవ్, మమతా గుప్తా, సంతోష్‌గుప్తా, ఆనంద్‌కుమార్ గౌడ్, ధన్‌రాజ్, ఆర్‌వి.మహేందర్‌కుమార్, సురేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

**సుభాన్‌పురాలో బస్తీ దవాఖానా ప్రారంభం..**

జాంబాగ్ సుభాన్‌పురాలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన మరో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. జాంబాగ్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ సుభాన్‌పురా బస్తీ ప్రజల విజ్ఞప్తి మేరకు గత సంవత్సర కాలంగా మంత్రి సహకారంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఈ బస్తీ దవాఖానా ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. సుభాన్‌పురా, ఆగాపురా, దర్గాయేకామూష్ ప్రాంతాల ప్రజలకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు.

# గుర్తు తెలియని మహిళ మృతి



**రాజేంద్రనగర్:** గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...హైదర్‌గూడ నుంచి లంగర్‌హౌస్ వెళుతున్న వంతెన వైపు వెళ్లే రహదారి పక్కన ఓ మహిళ మృతదేహం ఉందని మంగళవారం పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆమె (40) అప్పటికే మృతి చెంది ఉంది. స్థానికంగా బిక్షాటన చేస్తు జీవిస్తుండేదని స్థానికులు తెలిపారు. పంచనామా నిర్వహించి పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్టు వెల్లడించారు.

# భార్యను హత్య చేసి.. భర్త ఆత్మహత్య

కుటుంబ కలహాలతో నిండు ప్రాణాలు బలి


ప్రేమలత, జనార్దన్ (ఫైల్)

**అమీర్‌పేట:** కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను హత్య చేసిన భర్త..ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేటలో జరిగిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంటకు చెందిన మంచాల లక్ష్మి కుమార్తె ప్రేమలత (35)కు ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్ నగర్ పోచమ్మ దేవాలయం సమీపంలో ఉండే ఆగమయ్య కుమారుడు జనార్దన్(40)తో 2004లో వివాహం జరిగింది. వీరికి 17 ఏళ్ల కుమారుడు నిఖిల్ బాలాజీ, 16 ఏళ్ల కుమార్తె లిఖిత ఉన్నారు. ప్రేమలత కూకట్‌పల్లిలోని ఓ డెంటల్ క్లినిక్‌లో పనిచేస్తుండగా జనార్దన్ ఏ పనీ చేయక మద్యానికి అలవాటు పడ్డాడు. భార్యపై అనుమానంతో తరచు గొడవలకు దిగేవాడు. ఈ క్రమంలో సోమవారం ప్రేమలత తల్లిదండ్రుల వివాహ దినోత్సవం ఉండడంతో అందరు కలిసి తూంకుంటకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం ఇద్దరు విగత జీవులుగా పడిఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు విచారణ జరిపి జనార్దన్ ముందుగా భార్యను హత్య చేసినట్లు గుర్తించారు. ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. తరువాత చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ప్రేమలతది హత్య కేసుగా నమోదు చేశారు. జనార్దన్ తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

**మరోచోట మద్యం మత్తులో..**

**కేపీహెచ్‌బీకాలనీ:** మద్యం మత్తులో భార్యభర్తల నడుమ జరిగిన ఘర్షణ హత్యకు దారితీసింది. బండరాయితో భార్య తలపై మోదడంతో భార్య తీవ్ర గాయాలకు గురి కాగా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సంగారెడ్డి జిల్లా సింగూర్‌కు చెందిన మహమ్మద్ సాదిక్ అలీ, మున్నీ బేగం (35) గత నెలలో బతుకుదెరువు కోసం హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రాంతానికి వచ్చి కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి స్థిరనివాసం లేక ఫ్లై ఓవర్‌కింద, పార్కుల్లో నివసిస్తూ ఉంటున్నారు. సోమవారం కేపీహెచ్‌బీ ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద కల్లు, మద్యం సేవించిన సాదిక్ అలీ భార్య మున్నీ బేగంతో గొడవపడి ఆమె తల, ముఖంపై బండరాయితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలపాలైన మున్నీ బేగం అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# జవహర్ నవోదయలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

- ఆఖరు తేదీ మే 31
- ప్రవేశ పరీక్ష జూలై 22న

**రాయదుర్గం:** జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)లో 2023–24 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ఖాళీ సీట్లు భర్తీ చేయనున్నారు. జేఎన్‌వీ చరిత్రలో మొదటిసారిగా 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 31వ తేదీలోగా పంపాలి. నిన్నటి దాకా పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ఖాళీ సీట్లు ఉంటే 11వ తరగతిలో భర్తీ చేసేవారు. అయితే ఎంపికలో మరింత పారదర్శకత పాటించేందుకే ప్రవేశపరీక్ష పెడుతున్నారు.

- 2006 జూన్1వ తేదీ నుంచి జూలై 31, 2008 మధ్య జన్మించినవారు 2022–23 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన వారు అర్హులు. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్, ఓఎంఆర్ బేస్డ్ అబ్జెక్టివ్ టైప్ తరహాలో ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది. ప్రవేశ పరీక్ష జూలై 22వ తేదీన నిర్వహిస్తారు.